# ఇంటర్వ్యూ



ఒక చేత్తో ఫైలు పట్టుకుని విశాలంగా వున్న వరండాలోకి వచ్చాడు ప్రకాష్. అది ఒక ప్రైవేటు సంస్థ. ప్రకాష్‌కు అక్కడ ఇంటర్వ్యూ వుంది. సమయం పదిన్నర. పద కొండు గంటలకు ఇంటర్వ్యూ మొదలౌతుంది.

అప్పటికే అక్కడ నలుగురు కూర్చొని వున్నారు. అందరి చేతుల్లోనూ సర్టిఫికెట్లున్న ఫైళ్ళున్నాయి. వారితోనే తన పోరాటం. ఉన్నది ఒక ఉద్యోగం.

ప్రకాష్ సి.ఎ. ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యాడు. కాని, ఆ అర్హతకు తగిన ఉద్యోగం దొరకలేదు. ఎండమావుల్లాంటి ఇంటర్వ్యూల వెంట తిరుగుతున్నా ఫలితం సున్నా.

ప్రకాష్ కూడా వారితో కలిశాడు. తను ప్రిపేర్ అయిన విషయాలను మననం చేసుకోసాగాడు.

"పాతిక వేలు పోస్తే ఈ ఉద్యోగం గ్యారంటీ" హఠాత్తుగా అన్నాడు చారల చొక్కా అభ్యర్థి.

"మీ కెలా తెలుసు" అందరి గొంతుల్లో ఆశ్చర్యం.

"మాకు తెలిసిన వాడొకడు ఈ కంపెనీలో చేస్తున్నాడు. వాడు చెప్పాడు."

"ఖచ్చితంగా పాతికేనా. ఇంకా ఏమైనా తగ్గిస్తారా?" తెల్ల షర్ట్ అభ్యర్థి అడిగాడు.

"అదేమో తెలియదండి. అయినా మీ రెంతివ్వగలరు?" చారల షర్ట్ ప్రశ్న.

"నేనుమటుకు పదిహేనివ్వగలనండి" తెల్ల షర్ట్ జవాబు.

"మీ రెంతివ్వగలరండి?"

"పదిహేను."

"మీరెంత ...?"

"పదిహేను. మరి మీరెంత?" ఎదురు ప్రశ్న.

"పదిహేను."

"అయితే గట్టి పోటీయేనండి" నవ్వులు పువ్వులైనాయి.

ఈ మాటలు విన్న ప్రకాష్ గుండె గుభేలంది. 'పదిహేను వేలు ... అంత డబ్బే వుంటే తను ఈ అడ్డమైన ఇంటర్వ్యూల వెంట తిరిగేవాడా' అనుకున్నాడు ప్రకాష్.

ఇంకా ఉద్యోగం గురించి వారు మాట్లాడుకుంటూనే వున్నారు. వారి మాటలను ప్రేక్షకునిలా వింటూ వుండిపోయాడు ప్రకాష్. ఇంతలో చారల షర్ట్‌కు పిలుపు వచ్చింది. ఫైలు పట్టుకుని హుందాగా లోనికి నడిచాడు.

* * *

"గుడ్ మార్నింగ్ సార్!" విష్ చేశాడు ప్రకాష్.

"వెరి గుడ్ మార్నింగ్. సిడౌన్" అన్నాడు ఇంటర్వ్యూ ఆఫీసర్.

అతనికి యాభై ఏళ్ళుండవచ్చు. నిగనిగలాడే బట్టతల. అతనొక్కడే ఇంటర్వ్యూ చెయ్యడం మొదలుపెట్టాడు.

ప్రశ్నల పరంపర మొదలైంది. మొదట పేరు, ఊరు, అర్హతలు అడిగాడు. తర్వాత ఉద్యోగానికి సంబంధించిన ప్రశ్నలడిగాడు. అన్నింటికీ సమాధానం చెప్పాడు ప్రకాష్.

"వెల్ — చివరగా దీనికి జవాబివ్వండి. మీరీ ఉద్యోగానికి ఐ మీన్ ... ఈ ఉద్యోగానికి ఏమివ్వగలరు?" అడిగాడు.

"నమ్మకమైనటువంటి నా సేవను ఇవ్వగలను సార్!"

"నా ఉద్దేశం అది కాదు ..."

"నన్ను చెప్పనివ్వండి సార్. నేను వచ్చింది ఇంటర్వ్యూకుగాని, ఉద్యోగం కొనడానికి కాదు సార్. మీరన్నట్టు ఈ ఉద్యోగాన్ని కొనగల స్తోమతే నాకుంటే అడ్డమైన ఈ ఇంటర్వ్యూల వెంట తిరిగేవాణ్ణి కాదు. చిన్న వ్యాపారం చేసుకునేవాణ్ణి. ఇలా అన్నందుకు క్షమించండి. గుడ్ బై" బయటికి వచ్చేశాడు.

* * *

మరో వారం రోజుల తర్వాత ప్రకాష్ కొక లెటర్ వచ్చింది. విప్పి చదివాడు ప్రకాష్.

డియర్ మిస్టర్ ప్రకాష్,

కంగ్రాట్స్. మిమ్మల్ని మా సంస్థలో ఆడిటర్‌గా ఎన్నుకున్నాము. మరొక విషయం. ఇంటర్వ్యూలో అందరినీ మిమ్మల్ని అడిగినట్టు అడిగాము. అందరూ పది, ఇరవై ఇస్తామంటూ వచ్చారు. మాకు కావలసింది డబ్బు కాదు. అంతకుమించిన గుణం, శ్రద్ధ కావాలి. అవి మీలో చూశాము. ఎన్నుకున్నాం. రేపే వచ్చి ఆర్డర్స్ అందుకునేది. ప్లీస్ యాక్సప్ట్ మై పర్సనల్ కంగ్రాట్యులేషన్స్.

ఇట్లు
పరశురామ్
(ఇంటర్వ్యూ ఆఫీసర్)

ప్రకాష్ ఆనందానికి అవధుల్లేవు. ఇంతకాలానికి తనకు తగిన సంస్థలో, తగిన ఉద్యోగం వచ్చిందని ఆనందించాడు.

—నేదునూరు చంద్రశేఖర్

## ధర్మాసుపత్రి

టానిక్కులన్నీ
రవ్వల నెక్లెస్‌గా
రూపాంతరం చెంది-
డాక్టరుగారి భార్య
గొంతు పట్టేశాయి!

—ఎల్. దేవకి

## ప్రేరణ

నల్లని బొగ్గులో -
ఎర్ర రంగు పోయలేవు!
అగ్గిపుల్ల అంటించు -
ఆ ఎరుపునిక తాకలేవు!!

—ఆప్త చైతన్య